# అక్కినేని ఆశయాల అవార్డులు



సమావేశంలో రవి, భక్తవత్సలం, జి.ఆనంద్

- నవరత్నాలకు ప్రదానం
- నేడే అక్కినేని అవార్డుల ప్రదానోత్సవం
- అందరికీ ఆహ్వానం

సాక్షి ప్రతినిధి, చెన్నై: మహానటుడు, పద్మవిభూషణ్ గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ఆశయాల కొనసాగింపుగానే అక్కినేని ఇంటర్నేషనల్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్టు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (అఫా) అధ్యక్షుడు రవి కొండబాలు, కార్యదర్శి ధామా భక్తవత్సలం తెలిపారు. అక్కినేని తన జీవిత చరమాంకం వరకు వివిధ రంగాల్లోని నిష్ణాతులను సన్మానించే వారని, అక్కినేని మరణంతో ఆయన ఆశయాలు ఆగిపోకుండా ఆ బాధ్యతలను తాము స్వీకరించామని చెప్పారు. చెన్నైలో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాల క్రితం అమెరికాలో స్థిరపడిన తమకు అక్కినేని ఎంతో సన్నిహితులని అన్నారు. ప్రతి ఏటా అమెరికాకు వచ్చే అక్కినేని తమ ఇంట బస చేసి, తన భావాలను పంచుకునేవారని తెలిపారు. సినిమా రంగమే కాదు అనేక రంగాల్లో ఎందరో సుప్రసిద్ధులు ఉన్నారని, వారందరినీ గౌరవించడం తన విధి అనే వారని చెప్పారు. అమెరికాకు వచ్చి అక్కినేని అవార్డుల పేరున వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆయన స్వయంగా సత్కరించేవారని వారు తెలిపారు. 2014లో ఆయన మరణం తరువాత తానా అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ ఆలోచనతో అదే ఏడాది తమ ఫౌండేషన్‌ను స్థాపించి

మిగతా 2వ పేజీలో ▶

సాక్షి SAKSHI TELUGU DAILY
Wed, 14 December 2016
epaper.sakshi.com//c/15391428

# అక్కినేని ఆశయాల అవార్డులు

మొదటిపేజీ తరువాయి

అక్కినేని స్టాంప్‌ను విడుదల చేశామని తెలిపారు. అంతేగాక గుడివాడలోని ఏఎన్‌ఆర్ కాలేజీలో 2014లో తొలి అవార్డుల వేడుక, 2015 హైదరాబాద్‌లో రెండో అవార్డుల వేడుకను నిర్వహించినట్లు వారు చెప్పారు. అక్కినేని తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించిన చెన్నైలో మూడో అవార్డుల వేడుకను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నేడే అవార్డుల ప్రదానోత్సవం

ఈ నెల 14వ తేదీన చెన్నై కామరాజర్ అరంగంలో మూడో అవార్డుల వేడుకలను నిర్వహిస్తున్నట్లు రవి, భక్తవత్సలం తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రముఖ గాయకులు, సంగీత దర్శకుడు జి.ఆనంద్ నేతృత్వంలో సినీ, టీవీ కళాకారులతో స్వరమాధురి ఆర్కెస్ట్రాతో కచ్చేరీ, 7.30 గంటలకు అవార్డుల ప్రదానం, ప్రముఖుల ప్రసంగాలు, ఆ తరువాత మరలా కచ్చేరీ ఉంటుందన్నారు. రాష్ట్రంలోని తెలుగువారు, ముఖ్యంగా అక్కినేని అభిమానులంతా ఈ కార్యక్రమానికి హాజరై అవార్డుల మహోత్సవాన్ని విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు. అవార్డుల మహోత్సవాలకు అందరూ ఆహ్వానితులేనని, ప్రవేశం పూర్తిగా ఉచితమని కో-ఆర్డినేటర్ జి.ఆనంద్ అన్నారు.

సాక్షి SAKSHI TELUGU DAILY
Wed, 14 December 2016
epaper.sakshi.com//c/15391492